కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి దమ్ము ఉపనిషద్వాని

» న్యాయాధికారి దమ్ము ఉపనిషద్వాని

7

మాటమీదుంటారా?

పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకే టికెట్లు

గెలిచిన తర్వాత ప్రకటించిన ఎమ్మెల్యేలు





- ఆ తర్వాత పెరిగిన షాడో నేతల ప్రభావం
- వారి కనుసన్నల్లోనే కాంగ్రెస్ రాజకీయం
- స్థానికంలోనూ అదే జరిగితే పార్టీకి నష్టం
- కొత్త ఎమ్మెల్యేల తీరుపై భిన్నాభిప్రాయం

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ కొత్త వారే విజయం సాధించారు. వారికి గత అనుభవం లేకపోయినప్పటికీ, పార్టీ పరంగా సీనియర్లు కాకపోయినప్పటికీ.. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలతో చాలామంది ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. గెలిచిన వెంటనే చాలా మంది ఎమ్మెల్యేలు తమ వెంట నడిచిన వారికి, నమ్ముకుని ఉన్నవారికి పార్టీలో కానీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కానీ ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. ఒకవేళ ఇతర పార్టీల నుంచి ఎవరైనా వస్తే, ఆ గ్రామంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఒప్పుకున్నాకనే పార్టీలో చేర్చుకుంటామని, వారి సూచన ప్రకారమే పదవులు ఇస్తామని ప్రకటించారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వరకు కూడా ఇదే విధానాన్ని అవలంబించారు. ఆ సమయంలో స్థానికంలో బీఆర్ఎస్ బలంగా ఉండటంతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం చేరికలు అనివార్యంగా మారాయి. కొందరు ఎమ్మెల్యేలు స్థానిక నాయకులను సమన్వయం చేసుకుని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను కాంగ్రెస్‌లోకి తీసుకోగా.. కొందరు మాత్రం ఇష్టారీతిన చేర్చుకున్నారు. దీనివల్ల ఆయా గ్రామాల్లో అసమ్మతి కూడా నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలోనే మక్తల్ నియోజకవర్గానికి సంబంధించి అమరచింత మండలం నందిమల్లలో కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ ముఖ్య నేతలకు తెలియకుండా కొంత మంది బీఆర్ఎస్ నేతలను పార్టీలో చేర్చుకున్నారు. దీంతో ఆగ్రహించిన జిల్లా, మండల కమిటీ నాయకులు సమావేశమై, బీఆర్ఎస్ నుంచి కార్యకర్తలను చేర్చుకున్న చంద్రశేఖర్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. అలాగే ఆత్మకూరు మండలం రేచింతల ఎంపీటీసీ అలివేల బీసన్నను మండల అధ్యక్షుడు పరమేశ్ గ్రామ కమిటీ ఆమోదం లేకుండా.. పార్టీలో చేర్చుకున్నారని, ఎవరినీ చేర్చుకోవద్దని తీర్మానాలు చేసుకున్నారు. అయితే ఇప్పుడు ఎమ్మెల్యేలకు కొంత సీనియారిటీ రావడం, సంక్షేమ పథకాలు, పనుల విషయంలో వారిపై నాయకులు ఆధారపడాల్సి వస్తుండటంతో కొన్ని చోట్ల కేడర్‌ను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గతంలోలా బయటకు చెప్పకపోయినా, సీనియర్ కాంగ్రెస్ నేతలు ఆ పరిణామాలతో ఉడికిపోతున్నారు.

షాడో నేతలతోనే ముప్పు

అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సారి కొత్తగా ఎన్నికల బరిలో నిలిచిన వారికి గతంలో బీఆర్ఎస్‌లో పని చేసిన వారు కొందరు మద్దతుగా నిలిచారు. ఎన్నికలకు కొద్ది నెలల ముందు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అప్పట్లో చేరికలు అవసరం కాబట్టి పార్టీ సీనియర్ నాయకులు కూడా అందుకు అడ్డుచెప్పలేదు. అయితే వారు ఎమ్మెల్యే అభ్యర్థులకు దగ్గరై.. ప్రస్తుతం షాడో నాయకులుగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల నుంచి మొదలుకుని.. సంక్షేమ పథకాల అమలు బాధ్యతలు, సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కోసం దరఖాస్తులు చేసుకోవడం, బీఆర్ఎస్‌లో పనిచేసిన వారిని చేర్చుకోవడం వరకు వారే కీలకంగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న వారు చాలా మంది.. తమ అభ్యర్థనలను ఎమ్మెల్యేలకు చెప్పుకోవాలన్నా షాడో నాయకులు అడ్డంకిగా

(మిగతా 7లో..)

నాణ్యమైన ఇంధనం

అందించడమే ధ్యేయం

» పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ, ఐజీపీ రమేశ్‌రెడ్డి

» రాజాపేట శివారులో పోలీసు పెట్రోలు బంకు ఏర్పాటు

» ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీలతో కలిసి ప్రారంభించిన ఐజీపీ



ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్ లతో కలిసి పెట్రోల్ బంక్ ప్రారంభిస్తున్న ఐజీపీ రమేష్ రెడ్డి

వనపర్తి రూరల్ ,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు నాణ్యమైన ఇంధనాన్ని అందించడమే ధ్యేయంగా పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ, ఐజీపీ రమేశ్ రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా, వనపర్తి మండలంలోని రాజాపేట శివారులో, పోలీసు సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీసు పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి పెట్రోల్ బంకును ప్రారంభించారు. అనంతరం ఐజీపీ మాట్లాడుతూ వనపర్తి, కొత్తకోట, హైదరాబాద్ రోడ్డు మార్గాల్లో వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ ఉత్పత్తులను అందించేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంకును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని నాలుగు నెలల్లో పెట్రోల్ బంకు ఏర్పాటు చేసేందుకు సహకరించారని పేర్కొంటూ, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ ఎస్పీ రావుల గిరిధర్ సూచన మేరకు మదనాపురం రైల్వే స్టేషన్ నుంచి వనపర్తి వరకు 20 కిలోమీటర్లు కొత్త కారిడార్‌ను, నాలుగు లేన్ల రహదారిని నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ జిల్లాలో మహిళా సంఘాల వారితో ఏర్పాటు చేయనున్న పెట్రోలు బంకులకు పోలీసు శాఖ సహాయ సహకారాలు అందించాలని కోరారు.

ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ పెట్రోల్ బంక్ ఏర్పాటులో కలెక్టర్, ఎమ్మెల్యే, రెవెన్యూ అధికారులు చేసిన కృషికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేశ్, సీఐలు కృష్ణయ్య, రాంబాబు, శివకుమార్, రవిపాల్, ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, ఐఓసీఎల్ డివిజనల్ హెడ్ సుదీప్తో మిత్ర, సీనియర్ మేనేజర్ శరణ్య, చీఫ్ మేనేజర్ అమర్, శ్రీనివాస్, మహబూబ్‌నగర్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కోసం జాగారం



ఆత్మకూరు ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

6



రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగులు (ఫైల్)

వికాసం ఎప్పుడు?

» పెండింగ్‌లో రాజీవ్ యువ వికాసం

» కల్వకుర్తి డివిజన్‌లో 11,896 దరఖాస్తులు

» దరఖాస్తుల స్వీకరణ, ఇంటర్వ్యూలు పూర్తి

» ఇప్పటికీ మంజూరు కాని రుణాలు

7

బొంకూరులో క్షుద్రపూజల కలకలం

» ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకుంటామన్న ఎస్సై

7

క్రమశిక్షణ వల్లే.. ఈ స్థాయికి చేరా

» జోగులాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

» సమాజంలో గురువుకు గొప్ప స్థానం

» గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

» ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కార ప్రదానం

గద్వాల సర్కిల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణ, నైతిక విలువలే తనను ఈ స్థాయికి చేర్చాయని జోగులాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని, జిల్లా కేంద్రంలోని అనంత్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన వేడుకలకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి ఫలితాల్లో జిల్లాను రాష్ట్ర స్థాయిలో 32వ స్థానం నుంచి 26వ స్థానానికి చేర్చిన ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), యూట్యూబ్ తదితర ఆధునిక సాంకేతిక వనరులను వినియోగించుకుని విద్యాబోధన చేయాలని సూచించారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ జాతీయ ఛైర్మన్ శ్రీనివాస్‌శెట్టి గద్వాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోనే చదువుకున్నారని గుర్తు చేశారు. అనంతరం జిల్లా స్థాయి ఉత్తమ పురస్కారాలు పొందిన 63 మందికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీఈవో అబ్దుల్‌ఘని, డీసీఈబీ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, ఎంఈవోలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

రేపు

ఓటరు తుది జాబితా

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఓటరు తుది జాబితాను ఈ నెల 10న విడుదల చేయనున్నట్లు నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 6వ తేదీన విడుదల చేసిన షెడ్యూల్‌ను వివరించారు. 8న జిల్లా, మండల స్థాయిలో రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవోలతో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. 9వ తేదీన అభ్యంతరాల స్వీకరణ, 10న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు చెప్పారు. అంతకు ముందు కూడా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, ఫిర్యాదులు, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలపై తగిన సలహాలు, సూచనలు తీసుకుని తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించిందని తెలిపారు. జిల్లాలో 460 గ్రామపంచాయతీలు, 214 ఎంపీటీసీ స్థానాలు, 20 జడ్పీటీసీ స్థానాలు, 1,224 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 6,47,342 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 3,23,015 మంది పురుషులు, 3,24,316 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 11 మంది ఉన్నారని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్, హాజరైన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

విద్యార్థినులను కొరికిన ఎలుకలు

» బుద్దారం గురుకుల పాఠశాలలో ఘటన



విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

గోపాల్‌పేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండలంలోని బుద్దారం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏడుగురు విద్యార్థినులను ఎలుకలు కొరికాయి. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆదివారం రాత్రి తమ గదిలో నిద్రిస్తుండగా ఏదో కరిచినట్లు అనిపించింది. వెంటనే నిద్ర నుంచి లేచి గమనించగా ఎలుకలు పరుగెత్తుతూ కనిపించాయి. ఈ విషయాన్ని విద్యార్థినులు సోమవారం ఉదయం ప్రిన్సిపాల్‌కు తెలిపారు. విషయం బయటకు పొక్కకుండా వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఘటనపై ప్రిన్సిపాల్ వివరణ ఇస్తూ విద్యార్థినులను రాష్ట్రీయ బాలల సురక్ష అధికారులు పరిశీలించారని, ఎలుకలు ఎవరినీ క రువలేదని చెప్పారు. ముందు జాగ్రత్త చర్యగా ప్రాథమిక చికిత్స చేయించినట్లు తెలిపారు. విద్యార్థినులకు టీటీ, ఏఆర్వీ ఇంజక్షన్ ఇచ్చినట్లు ఆసుపత్రి వైద్యుడు చాంద్ పాషా తెలిపారు.

పరామర్శించిన అధికారులు

ఈ సంఘటనపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశానుసారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు, ప్రత్యేక అధికారి ఆంజనేయులు, తహసీల్దార్ పాండునాయక్, ఎంపీడీవో భవానీ పాఠశాలను పరిశీలించారు. బాధిత విద్యార్థినులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

రైతులు రోడ్డెక్కినా.. ప్రభుత్వానికి పట్టదా?

» మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

» 13న గద్వాలకు రానున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

» మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో శ్రీనివాస్‌గౌడు

గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు రోడ్డెక్కినా కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపులేదని, మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే రావడం ఖాయమని మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడు అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఈ నెల 13న గద్వాలకు రానున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు బాసుహనుమంతునాయుడు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసగౌడు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు 42 శాతం రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలను నిర్వహించాలన్నారు. జీవో ఇచ్చామని, కోర్టు కొట్టేసిందని కాకమ్మ కథలు చెప్పడం మానుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జిల్లాలో రైతులు ఆనందంగా ఉండేవారని, ఇప్పుడు ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. అమలు కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని, అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కిందని ఆరోపించారు. రైతులు, కార్మికులు, ఉద్యోగులతో పాటు అన్ని వర్గాల వారిని మోసం చేసిందన్నారు.

వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కే పట్టం కడతారని చెప్పారు. కేటీఆర్ పర్యటనను నాయకులు, కార్యక ర్తలు కలిసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, స్పోర్ట్స్ అథారిటీ మాజీ ఛైర్మన్ ఆంజనేయులు గౌడు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు గంజిపేట రాజు, మోనేశ్, కామేశ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు 2 బస్తాలు అందించాలి

» మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్



రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతమని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎక్కడ చూసినా యూరియాకోసం రైతులు రోజుల తరబడి కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. రైతుకు ఎన్ని ఎకరాలున్నా ఒకటి, రెండు బస్తాలు ఇవ్వడం వల్ల అవి ఏ మాత్రం సరిపోవని, ప్రతీ ఎకరాకు 2 బస్తాల యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం పాలమూరు నగరంలోని బోయపల్లి-కొత్తగంజి యూరియా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి రైతులందరికీ యూరియా సకాలంలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

● **రైతులకు నీళ్ల ప్యాకెట్ల పంపిణీ**

పాలమూరులో క్యూలో నిలబడ్డ రైతులకు పోలీసులు మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. టూటౌన్ సీఐ ఎజాజుద్దీన్ తన సిబ్బందిచేత రైతులకు నీళ్ల పంపిణీ చేయించారు. కేంద్రాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు..

మైసమ్మ ఆలయ లడ్డూ, పులిహోర విక్రయానికి వేలం

నవాబ్‌పేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయ లడ్డూ, పులిహోరాకు సోమవారం వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన నరేందర్ రూ.20,44,000లకు దక్కించుకున్నట్లు ఆలయ ఈవో నర్సింహులు, ఛైర్మన్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఏటా నిర్వహించే ఈ వేలం పాటకు వివిధ గ్రామాలకు చెందిన వ్యాపారులు పాల్గొని వేలం పాట నిర్వహించారు. అత్యధిక ధరకు లడ్డూ, పులిహోర దక్కించుకున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వీణాచారి, పాశం నరేందర్, పాశం గోపాల్, సుభాన్ చారి, కృష్ణయ్య, బక్క బాలయ్య, చెన్నయ్య, నారాయణ రెడ్డి, మైనొద్దీన్, నర్సింహులు, రవి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేటెంట్స్‌తో పీయూకి మంచి పేరు

» పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



డాక్టర్ రాంమ్మోహన్‌ను అభినందిస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబు

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు సాధించే పేటెంట్స్‌తో పాలమూరు యూనివర్సిటీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పాలమూరు యూనివర్సిటీలోని ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పనిచేస్తున్న రాంమోహన్ సింథసిస్ క్యారెక్టరైజేషన్ మాగ్నెటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ పెరవోస్కైట్ ఐరన్ ఎక్సెస్ మరియు డెఫిషన్సీ అనే అంశంపై పేటెంట్ పబ్లికేషన్ సాధించినందుకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబు, అధికారులు అభినందించారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పేటెంట్స్ ద్వారా న్యాక్‌గ్రేడింగ్‌లో ఉపయోగపడుతుందని, అధ్యాపకులు మరిన్ని పరిశోధనలు చేయడానికి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబు, అకాడమిక్ ఆడిట్‌సెల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్, ప్రిన్సిపాళ్లు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబ ఆలయంలో

రసాభాసగా టెండర్ల ప్రక్రియ



టెండర్‌దారులు, అధికారుల మధ్య జరుగుతున్న వాగ్వాదం

అలంపూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గతంలో మునుపెన్నడు లేనివిధంగా ఉభయ ఆలయాలకు షీల్డ్ టెండర్ల దరఖాస్తులు రావడంతో టెండర్ల నిర్వహణలో రసాభాస చోటుచేసుకున్నది. అష్టాదశ శక్తిపీఠం జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో షీల్డ్ టెండర్ల నిర్వహణకు దేవస్థానం వారు నోటిఫికేషన్ వేశారు. మొత్తం 17 టెండర్లకు 95 దరఖాస్తులు రాగా, 58 మంది సోమవారం టెండర్లు వేశారు. ఈ టెండర్లను అసిస్టెంట్ కమిషనర్ మదనేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో, ఆలయ ధర్మకర్తలు నాగశిరోమణి, జోగుల సరస్వతి, జగన్ మోహన్ నాయుడు, పులేందర్, ఆలయ ఈవో దీప్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ టెండర్ల ప్రక్రియ ప్రారంభంలోనే సెక్యూరిటీ, ఔట్‌సోర్సింగ్ టెండర్ల దరఖాస్తు ఫారాలలో సరైన సాంకేతిక లోపాల వల్ల టెండర్ దారులకు, అధికారుల మధ్య రసాబాస జరిగింది. పరస్పర వాదనలతో రెండు టెండర్లను కమిషనర్‌కు పంపి పూర్తి సమాచారం తెలియజేస్తామని అధికారులు తెలిపారు. స్టేషనరీ, కూరగాయలు, శానిటేషన్ షీల్డ్ టెండర్‌దారులు దక్కించుకోగా, మిగతా టెండర్లు లడ్డూ, పులిహోర, ప్రింటింగ్, ఫ్లెక్సీలు, సప్లయర్స్, పూలడెకరేషన్, లైటింగ్ పలు టెండర్లను వారంరోజుల్లో మళ్లీ రీటెండర్ వేస్తామని ఈవో దీప్తి తెలియజేశారు.

మద్దూరులో పునుగుపిల్లి

» పిల్లలమర్రికి తరలించిన ఫారెస్టు అధికారి



పునుగు పిల్లి

మద్దూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోతుల సంచారంతోనే పట్టణవాసులు బెంబేలిత్తిపోతున్న తరుణంలో పట్టణంలో మరో వింతైన జంతువు సోమవారం పట్టణ వాసుల కంటపడింది. మద్దూర్‌లోని రెనివట్ల మార్గంలో గల లెక్చరర్ రాములు ఇంట్లో ఓ జంతువు దూరిన విషయాన్ని ఆ ఇంటివాసులు గుర్తించారు. వింత ఆకారంతో ఉన్న జంతువుని చూసి భయపడి ఈ విషయాన్ని కాలనీ వాసులకు తెలిపారు. దీంతో ఆ జంతువును చూడటానికి పెద్దమొత్తంలో ప్రజలు గుమిగూడారు. ఇట్టి సమాచారాన్ని ఫారెస్టు అధాకారులకు అందించడంతో వెంటనే ఫారెస్టు అధికారి లక్ష్మణ్ చేరుకొని దానిని తమ వలలో బంధించారు. ఇది పునుగు పిల్లి అని, ఇట్టి జాతులు శేషాచలం అడవుల్లో ఉంటాయన్నారు. మహబూబ్‌నగర్ పిల్లల మర్రికి తరలించనున్నట్లు ఫారెస్టు అధికారి తెలిపారు.

యూరియా కోసం జాగారం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. రాత్రనక.. పగలనక కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసినా అరకొరగా అందటంతో నిరాశకు లోనవుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.



నారాయణపేట సింగిల్‌విండో దగ్గర రోడ్డుపై సోమవారం ఉదయం 5.30 గంటలకు పెద్దసంఖ్యలో బారులు తీరిన రైతులు

నారాయణపేట/భూత్పూర్/గోపాల్‌పేట/ఆత్మకూరు/జడ్చర్ల/మూసాపేట/పాన్‌గల్/ పెద్దకొత్తపల్లి/ దేవరకద్ర/మిడ్జిల్/నవాబ్‌పేట/బాలానగర్/చిన్నచింతకుంట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రాత్రికే చేరుకొని రైతాంగాం జాగరణ చేస్తూ అన్నదాతలు అగచాట్లకు లోనయ్యారు. నారాయణపేట సింగిల్ విండో కార్యాలయం దగ్గరికి ఆదివారం రాత్రి మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళా రైతులు చేరుకున్నారు. వరుస క్రమంలో ఉండి అక్కడే రాత్రంతా జాగరణ చేశారు. మరికొంత మంది రైతులు సోమవారం వేకువ జామున యూరియా కోసం పెద్ద సంఖ్యలో బారులు తీరారు. 580 బస్తాల యూరియా రాగా ఒక్కొక్క బస్తా అందించారు. భూత్పూర్‌లో గత నెల చివరి వారంలో సెప్టెంబరు 7,8తేదీల్లో ఇస్తామని అధికారులు రైతులకు ముందుగానే టోకెన్లు పంపీణీ చేస్తున్నారు. సోమవారం రైతుఆగ్రో కేంద్రంలో ఈ నెల 9 నుంచి 15 వరకు యూరియా సరఫార చేస్తామని దాదాపుగా వేయ్యి మందికి టోకెన్లు అందించారు. ఇప్పటి వరకు 850 మెట్రిక్ టన్నుల యూరియా అందించినట్లుగా వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు. గోపాల్‌పేటలో యూరియా కోసం సోమవారం ఉదయం నుంచే సింగిల్ విండో ఎదుట రైతులు చెప్పులు, కవర్లు పెట్టి క్యూలో నిలబడ్డారు. పోలీసుల సాయంతో యూరియా పంపిణీ చేశారు.

ఆత్మకూరులో సోమవారం ఉదయం 7 గంటల నుంచి రైతులు ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం ముందు నిరీక్షించారు. ఆత్మకూరు ఎస్‌ఐ నరేందర్ సిబ్బంది బందోబస్తు మధ్య పంపిణీ చేశారు. జడ్చర్ల పట్టణంలోని కావేరమ్మపేట దారిలో ఆగ్రో కేంద్రానికి 11 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా, సోమవారం ఉదయం 7గంటల ప్రాంతానికే దాదాపు మూడు వందల మంది రైతులు యూరియా కోసం బారులు తీరారు. అడ్డాకుల, మూసాపేట ఉమ్మడి మండలాల్లో సోమవారం యూరియా లోడ్లు రావడంతో సింగిల్ విండో కార్యాలయం, దుకాణాల వద్ద రైతులు పడిగాపులు కాశారు. 270 సంచుల యూరియాను పంపిణీ చేశారు. పాన్‌గల్‌లో 300 బస్తాల యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో కార్యాలయానికి చేరుకున్నారు. 300 బస్తాలు పంపిణీ చేయగా ఇంకా 516 టోకెన్లు మిగిలిపోయాయి.

పెద్దకొత్తపల్లి మండలంలోని కొత్తపేట సింగిల్ విండో కార్యాలయంలో యూరియా తీసుకోవడానికి రైతులు సోమవారం ఉదయం నుంచే క్యూ కట్టారు. కార్యాలయ ప్రహరీ పొడవునా రైతులు పడిగాపులు కాశారు. ఉదయం వచ్చిన రైతులు ఎండలో నిలిచి ఉండి ఆకలితో అలమటించారు. దేవరకద్ర మండలంతో పాటు నాగరం సహకార సంఘం కార్యాలయం వద్ద సోమవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. దాదాపు 400 మంది రైతులు తీసుకునేందుకు వచ్చారు. ఒక్కో రైతుకు ఒక బస్తా ఇచ్చారు. మిడ్జిల్‌లో ఉదయం నుంచి పీఏసీఎస్ కేంద్రం క్యూలో నిల్చొన్నారు. కొందరు రైతులు తమకు యూరియా సరిపోదని ఎక్కువ తీసుకెళ్లేందుకు మద్దతుగా మరికొందరిని క్యూలో నిలబెట్టుకున్నారు. నవాబ్‌పేట మండలానికి 1900 బస్తాలు తీసుకురాగా, రైతులు అర్ధరాత్రి నుంచే మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద వేచి ఉన్నారు. సోమవారం ఉదయం వరకు వందల మంది గుంపు కూడటంతో యూరియా బస్తాలు ఎలా ఇవ్వాలో తెలయక తల పట్టుకున్నారు. కొల్లూర్, చౌదూర్, నవాబ్‌పేట గ్రామాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసినా రైతులకు సరిపోలేదు. దీంతో సాయంత్రం వరకు వేచి చూసి తిరుగుముఖం పట్టారు. బాలానగర్ మండల కేంద్రంలోని సింగిల్‌విడో కార్యాలయం వద్ద సోమవారం యూరియా కోసం రైతులు వందలాది మంది గంటల తరబడి క్యూలో వేచి చూశారు. చిన్నచింతకుంటలో యూరియా కోసం రైతులు ఆగ్రో రైతు సేవ కేంద్రాల వద్ద సోమవారం బారులు తీరారు. మండల కేంద్రంలో 1,2 కు సంబంధించి మొత్తం 600 బస్తాలను రైతులకు పంపిణీ చేశారు. అలాగే పీఏసీఎస్ అప్పంపల్లి వద్ద మరో 300 బస్తాలను రైతులకు పంపిణీ చేశారు.



భూత్పూర్ ఆగ్రో కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు



జడ్చర్లలోని ఆగ్రో కేంద్రం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

అందరికీ వైద్యం అందిస్తాం

» వైద్యులు సమయానికి రావాలి

» వైద్య విధాన పరిషత్ సమన్వయకర్త డాక్టర్ రమేష్‌చంద్ర

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఉద్యోగుల హాజరు పట్టికను చూస్తున్న రమేష్‌చంద్ర

అలంపూరుచౌరస్తా, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల పేషెంట్లకు వైద్యం అందించేందుకు ప్రయత్నిస్తామని వైద్య విధాన పరిషత్ సమన్వయకర్త డాక్టర్ రమేష్‌చంద్ర అన్నారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన "అత్యవసరమైతే వైద్యం అంతంతే" కథనానికి ఆయన స్పందించి సోమవారం అలంపూరు చౌరస్తాలోని వందపడకల ఆసుపత్రిలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సయ్యద్‌బాష, డిప్యూటీ ఆర్‌ఎంవో డాక్టర్ అమీర్, డాక్టర్ కల్యాణ్, డాక్టర్ దివ్య, డాక్టర్ సుహాన, జూనియర్ అసిస్టెంట్ కల్యాణ్, సీనియర్ స్టాఫ్ నర్సులు సుబ్బలక్ష్మీ, భారతమ్మ, త్రివేణిలతో సమావేశమయ్యారు. ముఖ్యంగా వైద్యులు సమయానికి రావాలని, ఉదయం 9వరకు ఇక్కడ ఉండాలని, 9.15 గంటలకు ఓపీ తప్పని సరిగా ప్రారంభం కావాలన్నారు. రోగులు ఇబ్బంది పడరాదన్నారు. అన్ని విధాల బాగున్న గర్భిణులకు సాధారణ ప్రసవాలు ప్రారంభించాలని డాక్టర్ సుహానకు సూచించారు. హాజరు రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. ఉద్యోగులు ఎవరు కూడా అనుమతి లేనిదే సెలవు పెట్టరాదని, అతిక్రమిస్తే మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. ఓ ఫార్మాసిస్ట్ అనుమతి లేకుండా సెలవుపై వెళ్లిపోవడంపై సీరియస్ అయ్యారు. అనంతరం ఆయన గైనిక్ డాక్టర్ సుహానతో కలిసి కాన్పుల వార్డును పరిశీలించారు.

అక్కడ కవలపిల్లలతో ఉన్న గర్భిణిని పలకరించారు. మెరుగైన వైద్యం అందించాలన్నారు. క్యాజువాలిటీ, జనరల్ వార్డులను పరిశీలించారు. శానిటేషన్ సిబ్బందితో మాట్లాడారు. అనంతరం తాగునీటి సంపును పరిశీలించారు.

మార్చురీ భవనంలో నెర్రలుబారిన గోడలను పరిశీలించారు. కుంగిపోయిన గోడలకు మరమ్మతులు అవసరమని, నాణ్యత ప్రమాణాలు పాటించనందు వల్లే ఈ పరిస్థితి అని అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రి ఆవరణలో మొలచిన ముళ్లకంపను జేసీబీ సాయంతో తొలగించారు. ఆయన వెంట శానిటేషన్ సుపర్‌వైజర్ మధు, మార్చురీ వార్డు బాయ్ శ్రీను, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఎర్రబారుతున్న పత్తి పైరు



ఎర్రబారిన పత్తి పంట

» నష్టాలు తప్పవంటున్న రైతులు

» నీటి నిల్వ లేకుండా చూసుకోవాలంటున్న వ్యవసాయ అధికారులు

మానవపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో మొదట్లో వర్షం కురవక పోవడంతో పంట పొలాల్లో పత్తి విత్తనాలు రెండుసార్లు వేసిన పరిస్థితి. పంటలు వేసి రెండు నెలలు గడుస్తున్నా గత నెల రోజుల పాటుగా వర్షాలు కురుస్తున్న కారణంగా నల్లరేగడి పొలాల్లో పత్తి పంటలు ఎర్రబారుతున్నాయి. అదేవిధంగా వాడుముఖం పట్టి ఆకులు నేలవైపు వాలుతున్నాయి.

లక్షల్లో పెట్టుబడులు పెట్టి కాయలు కాసే సమయంలో పంట ఇలా వాడిపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైయింది. మండల పరిధిలోని నారాయణపురం, పెద్ద ఆముదాలపాడు, అమరవాయి, మానవపాడు, చెన్నిపాడు, పెద్దపోతులపాడు, గోకులపాడు, కొర్విపాడు, జల్లాపురం, బోరవెల్లి గ్రామాల్లో అధిక శాతం పత్తి పంటలు సాగు చేశారు. మండలంలో మొత్తం పంట సాగుచేసే భూమి 31540 ఎకరాలు ఉండగా, పత్తి 19,800 ఎకరాల్లో పత్తి సాగు చేశారు.

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పత్తి పంటలు ఆశించిన స్థాయిలో లేవని, ప్రస్తుత పరిస్థితిని చూసి రైతులు నష్టాలు తప్పవని అంచనా వేస్తున్నారు.

ఆశించిన స్థాయిలో పంటలు లేవు...



పత్తి పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడులు రావాలంటే తగిన మోతాదులో వర్షం కురవాలి. గత నెలరోజులుగా వర్షాలు కురవడంతో పంటలు దెబ్బతిన్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పంటపెట్టుబడులు పెరిగాయి. దీంతో రైతుకు ఇబ్బందిగా మారుతున్నది. ఇప్పటికే ఒక ఎకరాకు కౌలుతో 40 వేల వరకు ఖర్చు వచ్చింది. చివరి వరకు 80 వేలు వస్తుంది. దిగుబడి తగ్గితే నష్టాలు తప్పవు.

- భీమశేఖర్‌రెడ్డి మానవపాడు రైతు

నీరు నిల్వ ఉండకుండా చూడాలి...

పంట పొలంలో నీరు నిల్వ ఉండకుండా ప్రతి రైతు జాగ్రత్తలు తీసుకోవాలి. అధిక వర్షంతో ప్రస్తుతం పత్తి పైరులు ఎర్రబారుతున్నాయి. కొన్ని పొలాల్లో ఆకులు రాలిపోతున్నాయి. ఇందుకు ఎకరాకు 13.0.45 లీటర్‌కు 8 గ్రాములు కలుపుకుని పత్తి పంటపై పిచికారి చేయాలి. అదేవిధంగా ఎకరాకు 1.5 కేజీల మెగ్నీషియం, సల్ఫేట్ పిచికారి చేస్తే పంటలో మార్పు వస్తుంది.

- సందీప్ కుమార్, ఏవో మానవపాడు

వందలాది మందితో రాస్తారోకో



హన్వాడలో రాస్తారోకో చేస్తున్న, వివిధ పార్టీల నాయకులు, రైతులు

హన్వాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం అన్నదాతలు రెండున్నర గంటల పాటు రాస్తారోకో చేశారు. సోమవారం ఉదయం 4 గంటల నుంచే యూరియా కోసం అన్నదాతలు సొసైటీ వద్ద క్యూ కట్టారు. మండలానికి రెండు లారీలలో యూరియా 600 బస్తాలు వచ్చాయి. ఉదయం 7 గంటల నుంచి క్యూలో ఉన్న అన్నదాతలకు పంపిణీ చేశారు. 11 గంటలకు ఆయిపోయింది. అయితే బారీకెట్లు కట్టి ఒక్కక్కరికి టోకెన్లు ఇచ్చే సమయంలో తోపులాట చోటుచేసుకుంది. సొసైటీ గేట్ విరిగిపోయింది. వందల సంఖ్యలో అన్నదాతలు టోకెన్లు ఇచ్చారు. ఒక్కసారిగా కోపంతో అన్నదాతలు 2.30 గంటల వరకు తాండూర్ మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు. వారికి మద్దతుగా బీఆర్‌ఎస్ మండల నాయకులు కొండ లక్ష్మయ్య, నరేందర్, బాలరాజు, యాదయ్య, అన్వర్, శ్రీనివాసులు, వెంకటయ్య, జంబులయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు లింగన్న, రమణరెడ్డి, సీపీఎం లక్ష్మయ్య, బీఎస్పీ నాయకులు రాస్తారోకోలో పాల్గొన్నారు. ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులతో ఎస్‌ఐ వెంకటేష్ మాట్లాడి రాస్తారోకోను విరమింపచేశారు.

● ఖిల్లాగణపురం: యూరియా సకాలంలో అందించడం లేదని అన్నదాతలు ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. ఖిల్లాఘణపురం మండలంలోని రైతులకు యూరియా అందించాలని కోరుతూ సోమవారం రైతులు రాస్తారోకో చేశారు. గంటన్నర పాటు రోడ్డుపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ నెల 1వ తేదీన యూరియా ఇస్తామని టోకెన్లు రాసిచ్చి యూరియా లేదని సమాధానం చెప్తున్నారని రైతులు వాపోయారు. రైతు వేదిక వద్ద తెల్లవారుజామున 5 గంటల నుంచి క్యూలైన్లలో రైతులు నిరీక్షించారు. తహసీల్దార్ సుగుణ, మండల వ్యవసాయ శాఖ అధికారి మల్లయ్య రైతులను సముదాయించి ఆందోళనను విరమింప చేశారు.

మహమ్మదాబాద్: యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. ఈ సంఘటన సోమవారం మహబూబ్‌నగర్, చించోలి అంతర్రాష్ట్ర రహదారి మహమ్మదాబాద్ మండలం వెంకటరెడ్డిపల్లిగేటు వద్ద చోటుచేసుకుంది. యూరియా కోసం ఉదయం నుంచి వేచి ఉన్న రైతులకు యూరియా దొరకకపోవడంతో ఆగ్రహించారు. యూరియాను అందించాలంటూ ధర్నా నిర్వహించారు.



ఖిల్లాగణపురంలో యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

లక్ష్యం అధిగమించి విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో నిర్దేశించిన లక్ష్యాన్ని సోమవారం నాటికి అధిగమించామని ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్‌ఈ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను కలుపుకొని 610 మిలియన్ యూనిట్ల లక్ష్యం కాగా సోమవారం నాటికి 622 మిలియన్ యూనిట్ల లక్ష్యాన్ని చేపట్టామని తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లను ప్రారంభించి 4.494 మిలియన్ యూనిట్లను చేపట్టగా ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 298.473 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని చేపట్టామని తెలిపారు. అలాగే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లను ప్రారంభించి 4.088 మిలియన్ యూనిట్లను చేపట్టగా ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 324.683 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. ఎగువ నుంచి వరద ఇదే స్థాయిలో కొనసాగితే రికార్డు స్థాయిలో జల విద్యుత్ ఉత్పత్తిని చేపట్టే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

ఐటీఐ ఉత్తమ ప్రిన్సిపాల్‌గా జయమ్మ

» మంత్రి వెంకటస్వామి చేతుల మీదుగా అవార్డు ప్రదానం



మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఐటీఐ ప్రిన్సిపాల్ జయమ్మ

కల్వకుర్తి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జయమ్మ రాష్ట్రంలోనే ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికైంది. హైదరాబాద్‌లోని రెడ్‌హిల్స్ ట్యాప్సీ భవన్‌లో సోమవారం రాష్ట ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డుల ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంప్లాయి మెంట్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిశోర్, జాయింట్ సెక్రటరీ ఎస్‌వీకే నగేష్‌ల చేతుల మీదుగా జయమ్మ జ్ఞాపిక, సర్టిఫికెట్లను అందుకున్నారు. కల్వకుర్తిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఏటీసీలో వందశాతం అడ్మిషన్లు జరగడం, ఐటీఐలో నాణ్యమైన విద్యాబోధన నిర్వహిస్తుండడం తో అవార్డుకు ఎంపికయ్యానని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జయమ్మ తెలిపారు. రాష్ట్రంలో ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికైన జయమ్మను కళాశాలలోని అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు సత్కరించారు. డిప్యూటీ డైరెక్టర్ సి.నర్సయ్య, ఆర్‌డీజీ కె.రాజా తదితరులు ఉన్నారు.

భూవివాదంతో ఉద్రిక్తత


» పురుగుల మందు డబ్బాతో తహసీల్దార్ కార్యాలయానికి రైతులు



భూ సమస్యను పరిష్కరించాలని పురుగుల మందు డబ్బాతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రైతు జంగమ్మ, ఆమె కుమారుడు కృష్ణయ్య

మిడ్జిల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని వాడియాల గ్రామంలో ఓ భూమి వివాదం తీవ్రమై సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామానికి చెందిన గజ్జెల జంగమ్మ పేరుపై సర్వే నెంబర్ 156లో 6 గుంటల భూమి ఉన్నది. అయితే వారి దాయాదులు అయిన జంగయ్య ఆయన భూమిని అమ్మకోగా కొనుగోలు చేసిన వ్యక్తి తమకున్న ఆరు గుంటల భూమిని దున్నుతున్నట్లు బాధిత రైతు జంగమ్మ, ఆమె కుమారుడు కృష్ణయ్యలు ఆరోపించారు. కొనుగోలు చేసిన వ్యక్తితో పాటు తమ దయాదులైన జంగయ్య కుటుంబ సభ్యులు భూమిలోకి అక్రమంగా వచ్చి దున్నడమే కాకుండా తమను దూషించారని బాధితులు తెలిపారు. ఈ నేపథ్యంలో న్యాయం చేయాలని, లేకపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుం టామని జంగమ్మ, ఆమె కుమారుడు కృష్ణయ్య పురుగుల మందు డబ్బాతో తహసీల్దార్ కార్యా లయంలోని తహసీల్దార్ రాజు ముందుకు వచ్చి తమ గోడును వెళ్లబోసుకున్నారు. వెంటనే అప్రమత్తమైన కార్యాలయ సిబ్బంది మందు డబ్బా ను లాక్కున్నారు. మంగళవారం ఉదయం భూమి మొకాపైకి వచ్చి పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాజు హా మీ ఇచ్చినట్లు రైతు కృష్ణయ్య తెలిపారు. తమ భూమిని అక్రమంగా దున్నుకుంటూ తమను దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



నరేష్ కుమార్

ఆత్మకూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసిన సంఘటన ఆత్మకూరు పట్టణ కేంద్రంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఫిర్యాదుదారుడు మ్యాడం శ్రీను ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. అమరచింతకు చెందిన మ్యాడం శ్రీను కుటుంబంతో పోతు నరేష్ కుమార్ గత 14 సంవత్సరాల నుంచి ఆత్మకూరు పట్టణ కేంద్రం లోని రామకృష్ణ కాలనీలో నివాసం ఉంటున్నా రు. మా బావమరిది అయిన పోతు నరేష్ కు మార్ అలియాస్ నాని (42) గల వ్యక్తి మానసిక వైకల్యంతో ఉన్నాడు. ఈ నెల 7వ తేదీన సాయంత్రం ఐదు గంటల సమయంలో ఎప్పటి వలే బజారుకు వెళ్లొస్తానని ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో సోమవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశామని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోతు నరేష్ ఇంట్లో నుంచి వెళ్లే సమయంలో మెరూన్ కలర్ ఫుల్ షర్ట్, షార్ట్ ధరించి ఉన్నాడు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

క్రైం కార్నర్

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

పెంట్లవెల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భార్య కాపురానికి రాలేదని క్షణికావేశంలో భర్త ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ ఖయ్యూం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తెలుగు దేవులాల రాజు (35) భార్య జ్యోతి మధ్య రెండు నెలల క్రితం చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో భార్య జ్యోతి ఇద్దరి పిల్లలతో కలిసి పుట్టినిల్లయిన కొండ్రావ్‌పల్లికి వెళ్లిపోయింది. తిరిగిరాకపోవడంతో భర్త రాజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా, ట్రాక్టర్ సీజ్

కోడేరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో చోటు చేసుకుంది. సోమవారం మండలంలోని నాగులపల్లి నుంచి పెద్దకొత్తపల్లి మండలం వైపు ఇసుకను తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను తహసీల్దార్ విజయ్‌కుమార్ తనిఖీ చేశారు. అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీసులకు అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంటర్ ఆర్ఐ మహేష్, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటీ దగ్ధం

» ఇద్దరికి గాయాలు



మంటల్లో కాలిపోతున్న స్కూటీ

రాజాపూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ స్కూటీ దగ్ధమైంది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలో నివాసం ఉంటూ పోల్లేపల్లి సెజ్‌లో పనిచేస్తున్న సాయన్న, మణికంఠ రేజు వారిగా స్కూటీపై వెళ్తున్న సమయంలో హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న గుర్తు తెలియని స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాలు కాగా, స్కూటీ నుంచి మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. బాధితులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శివానందం తెలిపారు.

రైల్లోనుంచి జారిపడి యువకుడికి గాయాలు



గాయపడిన జీవరాజు

మానవపాడు, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రైల్వే గేట్‌కు కిలోమీటర్ దూరంలో రైలు నుంచి జారిపడి యువకుడు గాయపడ్డాడు. ఈ ఘటనపై 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. గుంతకల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న రైలులో మల్దకల్ మండలం తాటికుంటకు చెందిన జీవరాజు(25) కర్నూల్ నుంచి ప్రయాణం చేస్తుండగా మార్గమధ్యలో మానవపాడు అండర్ బ్రిడ్జికి కిలోమీటర్ దూరంలో రైలు నుంచి జారిపడిపోయాడనే సమాచారం రైల్వే అధికారులు తెలిపారు. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లి గాయాలైన జీవరాజుకు చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ఆసుపత్రికి తరలించినట్లు 108 సిబ్బంది రేణుక, దేవేందర్ తెలిపారు.

యువతి అదృశ్యం : కేసు నమోదు

నవాబ్‌పేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇంటివద్ద ఉంటూ టైలరింగ్ పని చేసుకుంటున్న తమ కూతురు కనపడటం లేదంటూ ఓ మహిళ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ విక్రం కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన సింధూజ ఈనెల 7న ఇంటి నుంచి వెళ్లిపోయి ఎంతకు రాకపోవడంతో ఆందోళన చెంది బంధువుల వద్ద వెతికినా జాడ కానరాలేదు. దీంతో గ్రామానికి చెందిన మహేశ్ అనే యువకుడిపై అనుమానం ఉందని తల్లి వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గొర్రె పిల్లలపై వీధికుక్కల దాడి

» 25 గొర్రె పిల్లల మృతి » రూ.లక్షా 20 వేల నష్టం



మృతి చెందిన గొర్రె పిల్లలు

ఊట్కూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలు చేసిన దాడిలో 25 గొర్రెపిల్లలు మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం సమిస్తాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గొర్రెల కాపరులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. ఊట్కూర్ మండలం కొల్లూర్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి పెద్ద బీరప్ప తన గొర్రెలను సమిస్తాపూర్ గ్రామ శివారులో మేపుతున్నాడు. ఎనిమిది రోజుల క్రితం పుట్టిన చిన్న గొర్రెపిల్లలు ఉండటంతో వాటి కోసం ఓ కంచెను ఏర్పాటు చేసి అందులో గొర్రె పిల్లలను వదలి పెద్ద గొర్రెలను మేపడానికి బీడు పొలాలకు తీసుకెళ్లాడు. అటువైపు వచ్చిన వీధి కుక్కలు కంచెలో చొరబడి గొర్రె పిల్లలపై దాడి చేసి విధ్వంసం సృష్టించడంతో గమనించిన కొందరు కుక్కలను తరిమివేశారు. అనంతరం కాపరులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూడగా అప్పటికే 25 గొర్రె పిల్లలు మృతి చెందాయి. గొర్రె పిల్లల మృతితో బాధితుడికి రూ.లక్షా 20 వేల వరకు నష్టం జరిగింది. ప్రభుత్వం కాపరులకు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

ఆలయ అర్చకుడి మృతి



సిరిగిరి నాగరాజు (ఫైల్)

గట్టు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలోని అంబాభవానీ మాత ఆలయంలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న పూజారి సిరిగిరి నాగరాజు (65) సోమవారం మృతి చెందాడు. ఈయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పూజారి మృతి పట్ల అంబాభవానీ ఆలయకమిటీ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



ప్రవీణ్ గౌడు (ఫైల్)

మల్దకల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆన్ చేసేందుకు వెళ్లిన యువకుడు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం నాగర్‌దొడ్డి శివారులో చోటుచేసుకున్నది. ఐజ గ్రామానికి చెందిన ప్రవీణ్‌గౌడు(24) నాగర్‌దొడ్డిలోని తన నాలుగు ఎకరాల వ్యవసాయ పొలంలో విద్యుత్ తీగిపోవడంతో సోమవారం అక్కడికి వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేశాక, కరెంటు తీగను సరిచేశాడు. తర్వాత ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆన్ చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ విషయమై ఎలాంటి సమాచారం అందలేదని ఎస్‌ఐ నందీకర్ తెలిపారు.

వికాసం ఎప్పుడు?

» పెండింగ్‌లో రాజీవ్ యువ వికాసం పథకం
» కల్వకుర్తి డివిజన్‌లో 11,896 దరఖాస్తులు
» దరఖాస్తుల స్వీకరణ, ఇంటర్వ్యూలు పూర్తి
» ఇప్పటికీ మంజూరు కాని రుణాలు



కల్వకుర్తి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన నిరుద్యోగులకు చిన్న తరహా పరిశ్రమలు, వృత్తి, వ్యాపారాల నిర్వహణకు సబ్సిడీపై రుణాలు ఇచ్చి పోత్సహించనున్నట్లు ప్రకటించింది.

అందుకు అనుగుణంగా నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఎంపికైన వారికి ఇంటర్వ్యూలు కూడా నిర్వహించింది. కానీ వారికి ఇప్పటివరకు మంజూరు పత్రాలు కానీ, రుణాలు కానీ ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

కల్వకుర్తి రెవెన్యూ డివిజన్లో..

రాజీవ్ యువ వికాసం పథకం కింద నాలుగు కేటగిరీలలో రుణాలు ఇవ్వనున్నారు. కేటగిరి -1 లో రూ. 50 వేలు, కేటగిరి -2లో రూ. లక్ష, కేటగిరి - 3లో రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు, కేటగిరి - 4 లో రూ.3లక్షల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలు అందించాల్సి ఉంది.

ఈ పథకం కోసం నాగర్‌కర్నూల్ జిల్లా, రెవెన్యూ డివిజన్ పరిధిలో 11,896 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన వారు ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసంలో దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఈ ఏడాది మే 5 నుంచి 20 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

మండలాల వారీగా..

కల్వకుర్తి మండలంలో 3,665 మంది దరఖాస్తు చేసుకోగా, 3,500 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కల్వకుర్తి మునిసిపాలిటీలో 1,510 మంది దరఖాస్తు చేసుకోగా, 1,235 మంది, వెల్దండ మండలంలో 2,310 మందికి, 1,530 మంది, ఊర్కొండ మండలంలో 970 మందికి, 404 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. చారకొండ మండలంలో 1,487 మందికి గాను 987 మంది, వంగూరు మండలంలో 1,987 మంది దరఖాస్తు చేసుకోగా 1,887 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కేటగిరీ-1లో ఎంపికైన వారికి జూన్ 2న, కేటగిరీ-2లో ఎంపికైన వారికి జూన్ 9న రుణ మంజూరు పత్రాలు ఇవ్వనున్నట్లు అధికారులు ప్రకటించారు కానీ, ఆ మేరకు ప్రభుత్వం మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. కానీ ఇప్పటి వరకు ఇవ్వకపోవడంతో దరఖాస్తుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున ఆ లోపే మంజూరు పత్రాలు అందించి, రుణాలను మంజూరు చేయాలని వారు కోరుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తే అందుకు అవకాశం ఉండదని చెప్తున్నారు.

వెంటనే నిధులు విడుదల చేయాలి



యువ వికాసానికి వెంటనే నిధులు విడుదల చేయాలి. దరఖాస్తుదారులందరిని భేషరత్తుగా యూనిట్లను మంజూరు చేసి గ్రౌండ్ చేయాలి. ఎంతో మంది నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారంగా 50వేల నుంచి రూ.4లక్షల వరకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ రుణాలు విడుదల చేసి సహకరించాలి.

- ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదు



ప్రభుత్వ ఆదేశానుసారం రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించాం. రుణల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాలేదు. ఆదేశాలు రాగానే అర్హులైన లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలు ఇచ్చి, యూనిట్లను గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకుంటాం. ఆ లోపే లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వనున్నాం.

- ఎన్.వెంకట్రాములు, ఎంపీడీవో

మాటమీదుంటారా?

(5వ పేజీ తరువాయి)

మారారు. మండలాల వారీగా విభజించుకుని.. వారే బాధ్యతలు చూసుకుంటుండంతో కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో బీఆర్‌ఎస్‌లో ఉండి తమపై కేసులు పెట్టిన వారిని, జైలుకు పంపించి, ఇబ్బందులకు గురి చేసిన వారిని పార్టీలో చేర్చుకుంటుండటంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు ప్రాధాన్యం ఉండబోదన్న భావనలోకి వెళ్లిపోతున్నారు. పార్టీలో చేర్చుకునే సమయంలో గ్రామ కమిటీలు, సీనియర్ నేతల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని ప్రకటించిన ఎమ్మెల్యేలు.. ఇప్పుడు షాడో నాయకులు చెప్పినట్లు చేస్తుండటంతో, వారితో ముప్పు తప్పదని బాహాటంగానే విమర్శిస్తున్నారు.

సమన్వయం అవసరం

గ్రామీణ ప్రాంతాల్లో పంతాలు, పట్టింపులు చాలా ఎక్కువగా ఉంటాయి. గతంలో తమకు వ్యతిరేకంగా పనిచేసిన వారిని ఎమ్మెల్యేలు కనికరించినా, గ్రామాల్లో ఉండే నాయకులు మాత్రం వ్యతిరేకించడం సర్వసాధారణం. అయితే ఎమ్మెల్యేలు ఈ సమయంలో చాలా సమన్వయంతో పని చేయాల్సి ఉంటుంది. పాత, కొత్త నాయకుల మధ్య సయోధ్య కుదర్చడం వారి బాధ్యత. ఎమ్మెల్యేలుగా గెలిచిన తర్వాత ప్రకటించినట్లుగా పార్టీలో ఉండే సీనియర్లు, ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం చేసి, ఓట్లు వేయించిన నాయకులకు మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వాల్సి ఉంది. కానీ మెజారిటీ నియోజకవర్గాల్లో ప్రస్తుత పరిస్థితులు అలా లేవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకవేళ టిక్కెట్ల కేటాయింపులో గందరగోళం ఏర్పడితే, అది మొదటి ముప్పు అవుతుందనే అంచనాలున్నాయి. ఇంకా గ్రామీణ స్థాయిలో బీఆర్‌ఎస్ పార్టీ కేడర్ పరంగా బలంగా ఉంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఏమాత్రం అవకాశం ఇచ్చినా సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను చేజార్చుకోవాల్సి ఉంటుంది. గతంలో వనపర్తి నియోజకవర్గంలోని తాడిపర్తిలో తమకు వ్యతిరేకంగా పనిచేసిన వారిని పార్టీలోకి తీసుకుంటున్నారనే కారణంతో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గణేశ్‌గౌడ్ ఎమ్మెల్యే మేఘారెడ్డి ఎదుటనే ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గత అనుభవాల నేపథ్యంలో ఎమ్మెల్యేలు ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇచ్చిన మాట ప్రకారం పార్టీలో సీనియర్లు, తమకు ఎన్నికల్లో సహకరించిన వారికి ఎమ్మెల్యేలు ప్రాధాన్యం ఇస్తారా? లేదా వేచి చూడాలి.

జాతీయ స్థాయి శిక్షణకు ఉపాధ్యాయుడి ఎంపిక



ఉత్తమ ఉపాధ్యాయుడు అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మక్తల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న అశోక్‌కుమార్ సెంటర్‌ఫర్ కల్చరర్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్(సీసీఆర్‌టీ) జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికయ్యాడు. ఉపాధ్యాయ సిద్ధాంతాల అభివృద్ధిలో భాగంగా దేశ రాజధానిలో ఢిల్లీలో ఈనెల 10 నుంచి 24 వరకు జరిగే శిక్షణలో భాగంగా జాతీయ విద్యా విధానం(ఎన్‌ఈటీ 2020) ఆధారిత బోధనా పద్ధతులు, సృజనాత్మకత ఆవిష్కరణలో శిక్షణ, సాంకేతిక వినియోగం వంటి అంశాలపై నిర్వహించే శిక్షణకు ఎంపికైనట్లు అశోక్‌కుమార్ తెలిపారు. తెలంగాణ నుంచి 10మంది ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను ఎంపిక చేయగా అందులో అశోక్‌కుమార్ ఒకరు. అశోక్‌కుమార్‌ను డీఈవో గోవిందరాజులు, విద్యాసాగర్, ఎంఈవో అనిల్‌గౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు.

మహిళలు ఆర్థికంగా రాణించేలా కృషి

- మెప్మా జిల్లా మిషన్ కోఆర్డినేటర్ శ్వేత



ఫుడ్ ఫెస్టివల్‌ను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ శ్వేత, కమిషనర్ చంద్రశేఖర్‌రావు

కొల్లాపూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పేద మహిళలను గుర్తించి వారిని స్వశక్తి సంఘాలలో చేర్పించి ఆర్థికంగా రాణించేలా కృషి చేస్తున్నామని మెప్మా జిల్లా మిషన్ కోఆర్డినేటర్ శ్వేత వెల్లడించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం మునిసిపాలిటీ పరిధి నుంచి 13 మహిళా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఫుడ్ ఫెస్టివల్ మేళా ప్రదర్శించారు. కార్యక్రమాన్ని కోఆర్డినేటర్ శ్వేత, మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలి

కొల్లాపూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో ఈనెల 13వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంపై సోమవారం లోక్ అదాలత్ చైర్మన్, జూనియర్ సివిల్ న్యాయాధికారి దమ్ము ఉపనిషద్వాని అధ్యక్షతన సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. న్యాయాధికారి మాట్లాడుతూ.. సివిల్, క్రిమినల్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశానికి 1వ అదనపు అసిస్టెంట్ పీపీ శిరీష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతుల నాగరాజు, కురుమూర్తి, బాలస్వామి, రామలక్ష్మమ్మ, న్యాయవాది రాజు పాల్గొన్నారు.

డీజే సౌండ్‌తో మహిళకు తీవ్ర అస్వస్థత



మక్తల్‌లో డీజే శబ్దానికి తీవ్ర అస్వస్థతకు గురైన మహిళ సుజాత

మక్తల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో ఆదివారం రాత్రి గణేష్ నిమజ్జన శోభయాత్ర సందర్భంగా డీజే సౌండ్‌తో సుజాత అనే మహిళ తీవ్ర అస్వస్థతకు గురైంది. రాఘవేంద్ర థియేటర్ సమీపంలో డీజే సౌండ్‌కు ఒక్కసారిగా కుప్పకూలింది. గమనించిన పోలీసులు వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నది. ఇటీవల భర్తను కోల్పోయిన సుజాతకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

కృష్ణా ప్రాజెక్టులకు తగ్గిన వరద

» ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల గేట్ల మూత
» శ్రీశైలం ప్రాజెక్టుకు 1.34 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
» మూడు గేట్ల ద్వారా 82,848 క్యూసెక్కులు సాగర్‌కు విడుదల

గద్వాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టుకు సోమవారం స్వల్పంగా ఇన్‌ఫ్లో తగ్గింది ప్రాజెక్టులోకి 1.34 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోని మూడు గేట్ల ద్వారా 82,848 క్యూసెక్కులు, కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 66,106 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 210.03 టీఎంసీలు నిల్వ ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 24 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లు మూసుకున్నాయి. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 15 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 16 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లను మూసివేశారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 6 వేల క్యూసెక్కులు అవుట్‌ఫ్లో ఉన్నది. భీమా నది నుంచి సన్నతి బ్యారేజీ అవుట్‌ఫ్లో 17 వేల క్యూసెక్కులు జూరాలకు వస్తోంది. ప్రస్తుతం జూరాలకు 65 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లను మూసివేశారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 43,640 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. సుంకేసులకు 25 వేలు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో 21 వేల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

రేషన్ దుకాణాల్లో పోర్టిఫైడ్ బియ్యం



జడ్చర్లలోని ఓ రేషన్‌దుకాణంలో వచ్చిన పోర్టిఫైడ్ బియ్యం

జడ్చర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ కావేరమ్మపేటలోని ఓ రేషన్ దుకాణంలో పోర్టిఫైడ్ బియ్యం రావడంతో లబ్ధిదారులు కంగుతిన్నారు. బియ్యం తీసుకోవడానికి వెళ్లిన లబ్ధిదారులకు ప్లాస్టిక్ మాదిరిగా ఉన్న బియ్యం ఉండడంతో రేషన్‌దుకాణ దారుడిని ప్రశ్నించారు. తమకు సరఫరా అయిన బియ్యం పంపిణీ చేస్తున్నామంటూ సదరు రేషన్ దుకాణదారుడు వెల్లడించారు. కాగా కొందరు లబ్ధిదారులు బియ్యం తీసుకోకుండా వెళ్లగా, మరికొందరు వచ్చిన బియ్యంను తీసుకెళ్తామంటూ తీసుకెళ్లడం గమనార్హం.

విద్యార్థులకు పాఠాలు బోధించిన డీఈవో



విద్యార్థులకు గణితం బోధిస్తున్న జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్

కల్వకుర్తి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు గణితం సబ్జెక్టును బోధించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరిశీలించి గణితంపై పలు అంశాలను వివరించారు. అనంతరం పాఠశాలలలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి మెరుగైన విద్యనందించాలని సూచించారు. విద్యార్థులు ప్రతీ రోజు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని, సబ్జెక్టుల్లో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులను డీఈవో ఆదేశించారు.

బొంకూరులో క్షుద్ర పూజల కలకలం

» రూ.70వేల విలువైన బంగారం గాయబ్
» మరో ఇంట్లో బంగారం, నగదు చోరీ
» ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకుంటామన్న ఎస్‌ఐ

అలంపూరుచౌరస్తా, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండలంలోని బొంకూరు గ్రామంలో వరుస ఘటనలు గ్రామప్రజలను కలవరపెడుతున్నాయి. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల వినాయక నిమజ్జనంలో ప్రజలుండగా సుంకులమ్మ గుడిలో గుర్తుతెలియని దుండగుడు చోరీకి విఫలయత్నం చేశాడు. ఆ మరుసటి రోజే మాలరాజశేఖర్ తన ఇంటి ముందు పెట్టిన ఆటోకు నిప్పుపెట్టారు. అంతకు ముందు కుర్వమద్దిలేటి ఇంటికి వచ్చిన ఓ ఇద్దరు వ్యక్తులు తాము కాటి కాపరులమని పరిచయం చేసుకుని, మీ ఇంట్లో సమస్యలున్నాయి, అందుకే అప్పులు ఉన్నాయని, పూజలు చేస్తే పోతాయని నమ్మించారు. దీంతో మద్దిలేటి భార్య సుజాత వారిని ఇంట్లోకి ఆహ్వానించింది. ఆమెను మాటల్లో పెట్టి మూడు రస్తాల వద్ద మరోపూజ చేయాలని, ఇందుకు బంగారం అవసరమని మరోమారు నమ్మించారు. అనుమానించడంతో మీ కుమారుడి చేతిలోనే పెట్టమని చెప్పారు. పూజ అనంతరం మళ్లీ బంగారంతో వస్తామని చెప్పడంతో, ఆమె తనకొడుకు శివకు రూ.70వేల విలువగల చెవి కమ్మలు ఇచ్చింది. అలంపూరు చౌరస్తా వైపు తమవెంట పల్సర్ బైక్‌పై శివను ఎక్కించుకుని వెళ్లి ఊరు బయటకు వెళ్లాక చేతిలో బంగారం మా చేతికి ఇచ్చి జిల్లెడు ఆకులు తేవాలని పిల్లవాడికి చెప్పారు.

తన చేతిలో ఉన్న బంగారం కమ్మలు దుండగుల చేతిలో పెట్టి జిల్లెడు ఆకుల కోసం వెళ్లగా, దుండగులు బం గారు కమ్మలతో పరారయ్యారు. దీనిగురించి ఎవరికీ చెప్పుకోలేక మిన్నకుండిపోయారు. ఇదే గ్రామంలో మరో ఇంట్లో 12తులాల వెండి కడియాలు, రూ.60వేల విలువైన బంగారు నగలు, రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు తెలిసింది. ఇలా వరుస సంఘటనలతో గ్రామంలో ప్రజలు కలవర పడుతున్నారు. ఈ విషయంపై ఉండవల్లి ఎస్సై శేఖర్ మాట్లడుతూ.. బాధితులు వచ్చి ఫిర్యాదు చేస్తే విచారణ చేసి, చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటర్వ్యూ..

ప్రజలకు అందుబాటులో పోలీసులు

● కె.గోకారి, ఎస్ఐ, రాజోలి



రాజోలి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని రాజోలి ఎస్ఐ కె.గోకారి అన్నారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపించినా, అత్యవసర పరిస్థితులు ఏర్పడినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు.

ఎలాంటి రక్షణ చర్యలు తీసుకుంటున్నారు?

ప్రతీరోజు రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. అత్యవసర సేవల్లో భాగంగా 100కు డయల్ చేసిన వారికి అందుబాటులో ఉంటూ, తగిన సహాయం చేస్తున్నాము.

డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారా?

ప్రతీరోజు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. రోజుకు 3 లేదా 5 కేసులు నమోదవుతున్నాయి. అలాగే వాహనదారులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్నాం.

అక్రమ రవాణాను అరికడుతున్నారా?

ఏపీ, తెలంగాణ సరిహద్దు ప్రాంతం సుంకేసుల డ్యాం వద్ద ప్రతీ రోజు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నాం. రాత్రిపూట పెట్రోలింగ్ కూడా నిర్వహించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నాం.

మండలంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారా?

రాజోలి, మాన్‌దొడ్డి గ్రామాల్లో మాత్రమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాము. రాజోలిలో గాంధీచౌక్, పోలీస్‌స్టేషన్ పరిధిలో కెమెరాలు పనిచేస్తున్నాయి. కొన్ని పని చేయడంలేదు. మిగితా గ్రామాల్లో ఏర్పాటు చేయాల్సి ఉంది.

న్యూస్ బాక్స్

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన ఎంఈవో శివప్రసాద్

మానవపాడు, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతి ఆరుగురు పొందారు. దీంతో సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంఈవో శివప్రసాద్ ఆధ్వర్యంలో పదోన్నతి పొందిన రామూర్తి, మౌలాలి, విజయమ్మ, రామేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డికి శాలువా, పూలమాలతో సన్మానం చేశారు. ఈసందర్భంగా ఎంఈవో శివప్రసాద్ మాట్లాడుతూ పదోన్నతి ప్రతీఒక్కరికి బాధ్యతను పెంచుతుందని, విద్యార్థులను విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మద్దిలేటి, హరిప్రసాద్, యోగి తదితరులు ఉన్నారు.

బాల కార్మికులను తిరిగి బడిలో చేర్పించాలి



పొలంలో పని చేస్తున్న బాలకార్మికులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

మల్దకల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దెలబండ గ్రామ శివారులో పత్తి పొలాల్లో పనిచేస్తున్న 16మంది బాలకార్మికులను మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గుర్తించారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని మద్దెలబండ జడ్పీహెచ్ఎస్‌లో చేర్పామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రేణుక, ప్రకాష్, జయన్న, ఈరన్న, గోవిందు ఉన్నారు.

సమస్యలను తక్షణం పరిష్కరించాలి

● సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేరు నరసింహ



కుర్వవీధిలో స్థానికులతో మాట్లాడుతున్న ఉప్పేరు నరసింహ

ధరూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేరు నరసింహ డిమాండ్ చేశారు. నాయకుల పర్యటనలో భాగంగా సోమవారం ధరూర్‌లోని కుర్వవీధిలో నుంచి స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకుల ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మేకల నరసింహులు, మోష, ఆంజనేయులు, తిమ్మప్ప, రాము, కృష్ణ, ఉన్నారు.

ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

● కలెక్టర్ బీఎం సంతోష్

● ప్రజావాణికి 55 ఫిర్యాదులు



ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలన్యూటౌన్,సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను సత్వమే పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 55 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, సంబంధిత అధికారులు ఉన్నారు.

● డబుల్ బెడ్రూం ఇళ్లను ఇవ్వాలి

డబుల్ బెడ్రూం ఇళ్ల డిప్పులో తమ పేరు వచ్చినా, ఇళ్లు కేటాయించలేదని పట్టణంలోని తెలుగుపేటకు చెందిన పర్వీన్, బుర్దపేటకు చెందిన బానూజీ, జొహిరబేగం, ముంతాజ్‌తో పాటు మరికొంతమంది మహిళలు కలెక్టర్‌కు తెలిపారు. ఇళ్ల పట్టాలను ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

● నష్ట పరిహారానికి యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

గట్టు మండలం తప్పెట్లమొర్సు గ్రామ శివారులో సర్వే నెంబర్ 82, 241, 244లో లావుని ప్రభుత్వ భూమి ఉన్నది. అయితే ఈ భూమిపై దొంగసర్టిఫికెట్ తీసుకొని ముచ్చోనిపల్లి రిజర్వాయర్ ప్యాకేజీ నెంబర్ 109లో నష్టపరిహారం పొందేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తప్పెట్లమొర్సుకు చెందిన వీరన్నగౌడ్, మరికొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● సెప్టిక్ ట్యాంకు నీరు పోయేలా చర్యలు

రాజోలి మండలంలోని కేజీబీవీలో సెప్టిక్ ట్యాంకు నీరు పోయేందుకు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు మిషన్ భగీరథ నీటి సంపు కనెక్షన్ ఇచ్చి నీటి కొరత తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు రాజేశ్, గోపాల్, యల్లప్ప, దస్తగిరి, చంటి, మంజుల కలెక్టర్‌ను కోరారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలి

● పోలీసులను ఆదేశించిన ఎస్పీ

● పోలీస్ గ్రీవెన్స్‌కు 14 ఫిర్యాదులు

గద్వాల క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను చట్టప్రకారం పరిష్కరించేలా కృషి చేయాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 14 ఫిర్యాదులు రాగా నేరుగా ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో ముఖ్యంగా భూ వివాదాలకు సంబంధించి 5, గొడవలకు సంబంధించి 2, ప్లాట్లకు సంబంధించి 3, పొలానికి దారి అడ్డగింతకు సంబంధించి 1, ఇతర అంశాలకు సంబంధించి 13 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయడం జరుగుతుందన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వారి వినతులు, ఫిర్యాదులు స్వీకరించాలన్నారు.

అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలన్నారు.

పెట్రోల్ బంకుల్లో పారదర్శకత అవసరం

అయిజ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకులలో పారదర్శకత అవసరమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి తెలిపారు. పార్టీ తరపున కార్యకర్తలతో కలిసి అయిజలోని పెట్రోల్ బంకులను పరిశీలించారు. ఏ ఒక్క బంకులోనూ వాహనదారులకు సౌకర్యాలు కల్పించలేదని అన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. మరుగుదొడ్లు, తాగునీరు, వాహనాలకు గాలి నింపడం వంటి సౌకర్యాలు లేవన్నారు. కొన్నిచోట్ల మీటర్ జీరో చేయకుండానే పెట్రోల్ పోస్తున్నారని తెలిపారు. కొలతల్లో మోసాలకు పాల్పడటమే కాకుండా, కల్తీ సైతం చేస్తూ వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మేడికొండ రహదారిలో గల భారత్ పెట్రోల్ బంకులో వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌గౌడు, నాగరాజు, లక్ష్మణాచారి, మాధవాచారి, ఖుషి, నవీన్, అజయ్, దేవన్న పాల్గొన్నారు.

సభా స్థలిని పరిశీలించిన మాజీ మంత్రులు



గద్వాల పాతబస్టాండ్ సర్కిల్‌లో సభా స్థలిని పరిశీలిస్తున్న మాజీ మంత్రులు

గద్వాల టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13న జిల్లాకు రానున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పాల్గొనే బహిరంగసభ స్థలాన్ని మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్‌తో కలిసి సోమవారం స్థానిక పాతబస్టాండ్ సర్కిల్‌ను పరిశీలించారు. గతంలో మంత్రి హోదాలో కేటీఆర్ పలు సందర్భాల్లో ఇదే స్థలంలో బహిరంగ సభ నిర్వహించగా, తిరిగి అక్కడే సభ ఏర్పాటు చేస్తున్నట్లు పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు, గద్వాల మునిసిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ తెలిపారు. సభ నిర్వహణ కోసం చేపట్టే ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సభకు హాజరయ్యే ప్రజలకు తగిన సౌకర్యాలు ఉండేలా చూడాలని మంత్రులు స్థానిక నాయకులకు సూచించారు.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

గద్వాలసర్కిల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సోమవారం గద్వాలలోని అనంత ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ బీఎం సంతోష్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘని ఘనంగా సన్మానించి పురస్కారాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పురస్కారాలు పొందిన వారిలో... జీహెచ్ఎం విభాగంలో పీ.విజయ్‌కుమార్(జడ్పీహెచ్ఎస్, మార్లబీడు, ధరూర్), జీ.అనితాబాయి (జడ్పీహెచ్ఎస్ తక్షశిల, ఉండవల్లి), డి.వెంకటనర్సయ్య (ప్రభుత్వ అభ్యసన ఉన్నతపాఠశాల, గద్వాల), తెలుగు ఎస్ఏ టి.సువర్ణమ్మ (యూపీఎస్ కుర్వపల్లి, గద్వాల), జి.శ్రీధర్(జడ్పీహెచ్ఎస్ జల్లాపూర్, మానోపాడు), ఏ.రాధిక (జడ్పీహెచ్ఎస్ ఉండవల్లి), హిందీ ఎస్ఏ టి.కస్తూరిబాయి (ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, గద్వాల), ఎం అరుణకుమారి (జడ్పీహెచ్ఎస్(బాలురు),అయిజ), గీత (జడ్పీహెచ్ఎస్ మల్దకల్), ఇంగ్లిష్ ఎస్ఏ...ఎస్ మల్లప్ప (జడ్పీహెచ్ఎస్ రేవులపల్లి, ధరూర్), వీ వసంత్‌కుమార్ (జడ్పీహెచ్ఎస్ క్యాతూర్, అలంపూర్), టీ హేమచందర్ (జడ్పీహెచ్ఎస్ ధరూర్), నాగలక్ష్మమ్మ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అలంపూర్), గణితం ఎస్ఏ...జీ సుధాకర్‌రెడ్డి (జడ్పీహెచ్ఎస్ బుక్కాపూర్, అలంపూర్), సయ్యద్ అబ్దుల్లా (జడ్పీహెచ్ఎస్ ధరూర్), శంకరప్ప (జడ్పీహెచ్ఎస్ మునగాల, ఇటిక్యాల), ఏ చిన్న వీరన్న (జడ్పీహెచ్ఎస్ కొండపల్లి, గద్వాల), ఫిజికల్ సైన్స్ ఎస్ఏ... కే సాయిప్రకాష్ (జడ్పీహెచ్ఎస్ (ఎస్సీ) అలంపూర్), జీ మురళీధర్ (ఎంపీహెచ్ఎస్ కేటీదొడ్డి), ఆర్ శివశంకర్‌రెడ్డి (జడ్పీహెచ్ఎస్ ఉత్తనూర్, అయిజ), బయోలాజికల్ సైన్స్ ఎస్ఏ... కే నాగరాజు (జడ్పీహెచ్ఎస్ వడ్డేపల్లి), వెంకటేశ్వర్లు (యూపీఎస్ కొత్తపల్లి, గద్వాల), జలజ (జడ్పీహెచ్ఎస్ పాల్వాయి, మల్దకల్), సోషల్ ఎస్ఏ...ఏ లక్ష్మీదేవి (జడ్పీహెచ్ఎస్ శాంతినగర్, వడ్డేపల్లి), నర్సింహులు (జడ్పీహెచ్ఎస్ ఇందూవాసి, గట్టు), రాజుసాగర్ (యూపీఎస్ రాయాపురం, గట్టు), కృష్ణగౌడ్ (జడ్పీహెచ్ఎస్ ఉప్పల్, అయిజ), ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం...వెంకటేశ్వర్లు (ఎంపీపీఎస్ దాసరిపల్లి, మల్దకల్), ఎన్ రాజేశ్వర్‌రెడ్డి (ఎంపీపీఎస్ బొచ్చువీరాపురం, ఎర్రవల్లి), ఎస్జీటీ విభాగంలో...కే అన్నపూర్ణ (ఎంపీపీఎస్ లింగన్వాయి, అలంపూర్), టీసీహెచ్ ప్రసాద్ (ఎంపీపీఎస్ బైరంపల్లి, అలంపూర్), బీ జగన్నాథ్‌రెడ్డి (ఎంపీపీఎస్ ఎములోనిపల్లి, ధరూర్), ఎం విజయ్‌కుమార్ (ఎంపీపీఎస్ మార్లబీడు, ధరూర్), సౌమిత్రి (ఎంపీయూపీఎస్ గుంటిపల్లి, గద్వాల), రమేష్ (ఎంపీయూపీఎస్ వెంకంపేట, గద్వాల), బాలరాజు (యూపీఎస్ తుమ్మలచెరువు, గట్టు), కే వెంకటేష్ (పీఎస్ కొత్తపల్లి, గట్టు), జీ మేరీప్రియాంక (ఎంపీపీఎస్ పులికల్, అయిజ), బీ మల్లేష్ (ఎంపీపీఎస్ ఉత్తనూర్, అయిజ), బీ సురేష్ (యూపీఎస్ షాబాద్, ఇటిక్యాల), బీ వినోద్‌కుమార్ (ఎంపీపీఎస్ చాగాపురం, ఇటిక్యాల), డీ గోపాల్ (పీఎస్ మైలగడ్డ, కేటీ దొడ్డి), చంద్రశేఖర్ (పీఎస్ ఈర్లబండ, కేటీ దొడ్డి), శ్రీనివాస్‌నాయుడు (ఎంపీపీఎస్ విఠలాపురం, మల్దకల్), నాగరాజు (ఎంపీపీఎస్ ఉలిగేపల్లి, మల్దకల్), శ్రీలేఖ (పీఎస్ మానోపాడు), మక్బుల్ అహ్మద్ (పీఎస్ చెన్నిపాడు, మానోపాడు), రామాంజనేయులు (ఎంపీపీఎస్ న్యూప్లాట్స్, రాజోలి), ద్రోణేశ్వరి (ఎంపీపీఎస్ తుమ్మలపల్లి, రాజోలి), ఎస్ వెంకటనర్సమ్మ (ఎంపీపీఎస్ శాంతినగర్, వడ్డేపల్లి), కే మద్దిలేటి (యూపీఎస్ జులెకల్, వడ్డేపల్లి), సుమంగళ (యూపీఎస్ మారమునగాల-2, ఉండవల్లి), సురేష్ (పీఎస్ బైరాపూర్), ఏ.విజయభాస్కర్ (ఎంపీయూపీఎస్ దువ్వాసిపల్లి, ఎర్రవల్లి), కే పారిజాత (ఎంపీయూపీఎస్ షేక్‌పల్లి, ఎర్రవల్లి, క్రాఫ్ట్... ఆనందం (ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, గద్వాల), గణితం ఎస్ఏ (ఉర్దూ మీడియం)... మహ్మద్‌ఇక్బాల్ (ఎంపీహెచ్ఎస్ రాజోలి), ఎస్జీటీ (ఉర్దూ మీడియం)...రెహానా సుల్తానా (ఎంపీహెచ్ఎస్ ధరూర్), ఫిజికల్ డైరెక్టర్...మహ్మద్ బషీర్ అహ్మద్ (జడ్పీహెచ్ఎస్ ఉప్పల్, అయిజ), కె.స్రవంతి (ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, గద్వాల), కేజీబీవీ...టీ విజయలక్ష్మి(స్పెషలాఫీసర్, మల్దకల్), భారతి (ఇంగ్లిష్ పీజీసీర్టీ, గద్వాల), జీ రాజేశ్వరి (బయోసైన్స్ సీఆర్టీ, అయిజ)లు ఉన్నారు.


56 పోస్టులకు 1651 దరఖాస్తులు

గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాల, సర్వజన వైద్యకళాశాలలో వివిధ రకాలైన టెక్నికల్, నాన్‌టెక్నికల్ విభాగాలలో 56 పోస్టులకుగాను ఏకంగా 1,651 దరఖాస్తులు వచ్చినట్లు తిరుమల ఏజెన్సీ నిర్వాహకులు రామ్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ముఖ్యంగా డాటా ఎంట్రీ ఆపరేటర్ 5 పోస్టులకు గాను 335 దరఖాస్తులు, ఎలక్ట్రిషియన్ 2 పోస్టులకు 84, వార్డు బాయ్ 3 పోస్టులకు 109 దరఖాస్తులు, ఆఫీస్ సబార్డినేట్ 6 పోస్టులకుగాను 342, రికార్డు అసిస్టెంట్ 1 పోస్టుకు గాను 318 దరఖాస్తులు, ల్యాబ్ అటెండెంట్ 6 పోస్టులకుగాను 176 దరఖాస్తులు వచ్చినట్లు ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. వచ్చిన దరఖాస్తులలో పైఅధికారుల ఆదేశాల మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) ఇచ్చిన అర్హతలను ఆధారంగా, రోస్టర్ పద్ధతిలో పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు ఏజెన్సీ నిర్వాహకులు రామ్మోహన్ తెలిపారు.

ఓటర్ల జాబితాపై అభిప్రాయాల సేకరణ

గట్టు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఓటర్ల తుదిజాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో చెన్నయ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు సమావేశానికి హాజరయ్యారు. ప్రచురించిన ఓటర్ల జాబితాపై నాయకులు అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామాల్లో ప్రచురించిన ఓటర్ల జాబితాలో అనేక తప్పిదాలు ఉన్నాయని, మృతిచెందిన వారి ఓట్లతో పాటు కుటుంబ సభ్యుల వివరాలను కరెక్టుగా చేర్చలేదంటూ వారుఅధికారి దృష్టికి తీసుకువెళ్లారు. ఓటర్ల జాబితాలో ఉన్న ఓటరు పేరు తప్పులుగా ఉన్నాయని, వాటిని సరిచేయాలని కోరారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జాలర్లకు లైఫ్ జాకెట్లు అందజేత



జాలర్లకు లైఫ్‌జాకెట్‌లు అందజేస్తున్న ఎస్ఐ నందీకర్

మల్దకల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటికుంటలో ఉన్న రిజర్వాయర్‌లో జీవనోపాధి నిమిత్తమై నిత్యం చేపలవేటకు వెళ్తున్న వేటగాళ్ల ప్రాణ రక్షణ కోసంమానవత్వంతో స్పందించిన మల్దకల్ ఎస్ఐ నందీకర్ సొంత ఖర్చులతో రూ.పదివేలతో నాణ్యతమైన లైఫ్ జాకెట్లు తీసుకొని తాటికుంట రిజర్వాయర్ వద్ద జాలర్లకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి కానిస్టేబుల్ తిప్పారెడ్డి, ఇస్మాయిల్ ఉన్నారు.

డీఈవోతో వాగ్వాదం

గద్వాల సర్కిల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు సక్రమంగా పాటించకుండా అనర్హులైన కొందరిని జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారని సోమవారం ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘనితో కొందరు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పురస్కారాల వేదిక వద్ద వాదనకు దిగారు. సీనియారిటీని పక్కనపెట్టి జూనియర్‌లను ఎంపిక చేశారని, ఇదివరకే పురస్కారాలు అందుకున్న వారిని తిరిగి ఎంపిక చేశారని, తమకు అనుకూలురైన వారికే పురస్కారాలు అందేలా సెలెక్షన్ కమిటీలోని కొందరు జాబితాను తయారు చేశారని ఆరోపణలు చేశారు. సుదీర్ఘకాలం ఉపాధ్యాయ సేవలందించిన వారిని పక్కనపెట్టి ఎంఈవోలు సూచించిన వారి పేర్లను విచారణ చేయకుండానే ప్రకటించడం ఏమిటనీ డీఈవోను ప్రశ్నించారు. ఎంపిక కలెక్టర్ ఆధ్వర్యంలో చాలా పారదర్శకంగా జరిగిందని ఇన్‌చార్జి డీఈవో వివరణ ఇచ్చారు. అయినా వారు వెనక్కి తగ్గకపోవడంతో మరికొందరు ఉపాధ్యాయ సంఘాల నేతలు జోక్యం చేసుకుని వివాదం సద్దుమణిగేలా చేశారు.

సీడ్ ఆర్గనైజర్‌పై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న రైతులు

గద్వాలన్యూటౌన్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): రైతులకు సీడ్‌పత్తి పంట డబ్బులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సీడ్ ఆర్గనైజర్ రామచంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు సోమవారం నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు వీవీ నరసింహ మాట్లాడుతూ అయిజ మండలంలోని యాపదిన్నె మాదిక నీకయ్యలకు సంబంధించిన 923 కిలోలు, గొల్లగోపాల్‌కు చెందిన 30కేజీలు, జమ్మన్నకు చెందిన 3 క్వింటాళ్ల నార్త్ కంపెనీ వెరైటీ సీ 8000, అలాగే గొల్ల అంజనేయులు, గొల్లరాముడుకు చెందిన 23 క్వింటాళ్ల విత్తనాలను సోమన్న గార్లపాడుకు చెందిన రామచంద్రారెడ్డి అనే ఆర్గనైజర్ దగ్గర 2024 సంవత్సరంలో సీడ్‌పత్తి పంట విత్తనాలు తీసుకొని పంట పండించి ఇవ్వడం జరిగింది. దీనిపై జులై నెలలో లెక్కలు చేయగా ముగ్గురు రైతులకు సంబంధించి ఒక్కో రైతుకు రూ.2 లక్షల పైచిలుకు రావాల్సి ఉండగా నేడు, రేపు అంటూ కాలాన్ని వెల్లబుచ్చుతున్నాడన్నారు. ఇక గొల్లగోపాల్, గొల్లరాముడుకు సంబందించిన 23 క్వింటాళ్లకు సంబంధించి విత్తనాలపై ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన సమాచారం ఇవ్వడంలేదని, దీంతో రైతులు అప్పులబాధతో ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ఆర్గనైజర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, రైతు సంఘం నాయకులు ఉన్నారు.

ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి



సైబర్ వారియర్స్‌తో ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ మొగులయ్య

●సైబర్ వారియర్స్‌తో ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం సైబర్ వారియర్స్, డి4సీ సిబ్బందితో ఎస్పీ శ్రీనివాసరావు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న క్రమంలో ప్రజలకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించాలన్నారు. సైబర్ వారియర్స్ రెగ్యులర్‌గా అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన, ప్రజల్లో సైబర్ నేరాలబారిన పడకుండా తగుసూచనలు ఇవ్వాలన్నారు. అలాగే సైబర్ సెల్‌తో సమన్వయం పనిచేస్తూ సోషల్ మీడియాలో అనుమానాదస్పద కంటెంట్‌పై నిఘా ఉంచడం, డిజిటల్ ఫోరెన్సిక్, సైబర్ ఇంటలిజెన్స్ సేకరణ వంటి బాధ్యతలను కూడా సమర్థవంతంగా చేయాలన్నారు. సైబర్ వారియర్స్ తమ బాధ్యతను నైతికంగా, చట్టబద్ధంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగులయ్య, ఐటీసెల్ ఎస్ఐ షకూర్, డి4సీ సిబ్బంది, సైబర్ వారియర్స్ ఉన్నారు.

వైద్యుల కోసం ఎదురుచూపులు

● వంద పడకల ఆస్పత్రిలో

తలుపులు మూసి రోగుల నిరసన



వైద్యులు రాకపోవడంతో సోమవారం వార్డులో వేచిచూస్తున్న రోగులు

అలంపూరుచౌరస్తా, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అలంపూరు చౌరస్తాలోని వందపడకల ఆసుపత్రికి సీజనల్ వ్యాధుల నేపథ్యంలో రోగులు క్యూ కడుతున్నారు. దీంతో రోజుకు సుమారు 150దాక ఓపీలు వస్తున్నాయి. సోమవారం 70మంది అడ్మిట్ అయిన రోగులు ఉన్నారు. కానీ వైద్యులే సమయానికి రావడంలేదని రోగులు వాపోతున్నారు. సోమవారం ఉదయం ఓపీలు తీసుకున్నాక గంటల తరబడి డాక్టర్ల కోసం వేచి చూసినా రాలేదని కొందరు రోగులు ఆగ్రహం వ్యక్తం చేసి, ఆసుపత్రి తలుపులు మూశారు. దీంతో అక్కడే ఉన్న చిన్నపోతులపాడు మాజీ ఎంపీటీసీ శేఖర్ కల్పించుకుని రోగులను వారించి తలుపులు తెరిచారు. విషయం తెలుసుకున్న ఆంధ్రజ్యోతి అక్కడికి వెళ్లి రోగులతో మాట్లాడగా ఓపీ తీసుకుని గంటల తరబడి వేచి చూసినా వైద్యులు రావడంలేదని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రోగులు తెలిపారు. ఉదయం 10:15 గంటలకు కంటి డాక్టర్ దివ్య ఒక్కరే విధులకు హాజరయ్యారు. ఈ విషయమై డిప్యూటీ ఆర్ఎంవోకు ఆంధ్రజ్యోతి ఫోన్ చేయగా క్షణాల్లో వచ్చి రోగులను చూశారు. వచ్చేది ఆలస్యం మళ్లీ మధ్యాహ్నం వెళ్లిపోతున్నారని రోగులు అసహనం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని స్టాఫ్ నర్సులు కొందరు, పర్యవేక్షణ కోసం వచ్చిన వైద్య విధాన పరిషత్ ఉమ్మడిజిల్లా సమన్వయ అధికారి డా. రమేశ్‌చంద్ర దృష్టికి తీసుకెళ్లారు. ఈవిషయంపై సీరియస్ అయ్యారు. తీసుకునే జీతం రోగుల సేవ కోసమేనని, వేళాపాల పాటించాలని ఆదేశించారు. ప్రారంభదశలో ఆసుపత్రికి అవసరమైన వైద్యులను ప్రభుత్వం కేటాయించినప్పటికీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌ను నియమించడం వల్ల పర్యవేక్షణ కొరవడిందని రోగులు అభిప్రాయపడుతున్నారు.

జీతం ఇక్కడ పని అక్కడ..

వంద పడకల ఆసుపత్రిలో సుమారు 30 మంది స్టాఫ్ నర్సులు అవసరం. కానీ ప్రస్తుతం 11మంది మాత్రమే ఉన్నారు. ఇందులో 5మంది సీనియర్ స్టాఫ్‌నర్సులు ఉన్నారు. అయితే ఆసుపత్రి ప్రారంభానికి ముందే ప్రభుత్వం స్టాఫ్‌నర్సులను వివిధ శాఖల ఉద్యోగులను కేటాయించింది. ఆ సమయంలో స్టాఫ్ నర్సుల అవసరం లేకపోవడంతో అలంపూరు ఆసుపత్రికి పంపారు. ఆసుపత్రి ప్రారంభమై రెండునెలలు కావస్తోంది. శానిటేషన్ సిబ్బంది నియామకాలను ఓ ఏజెన్సీకి ఇచ్చారు. కానీ అధికారులు నేటికీ అలంపూరులో పనిచేసే అయిదు మంది నర్సులు రప్పించలేదు. దీంతో ఇక్కడ ఉన్నవారిపైనే భారం పడుతున్నది.

పెంచిన పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దివ్యాంగులు

గద్వాలన్యూటౌన్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు పెంచిన పెన్షన్‌ను వెంటనే అమలు చేసేలా చూడాలని, ప్రభుత్వం ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముందు దివ్యాంగులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా దివ్యాంగుల సేవా సంఘం అధ్యక్షుడు టెంకాయల చంటి మాట్లాడుతూ జిల్లా దివ్యాంగుల సేవా సంఘం వికలాంగుల పోరాట సమితి ఆధ్వర్యంలో మందకృష్ణ పిలుపుమేరకు దివ్యాంగులకు రూ.4వేల నుంచి రూ.6వేలు వెంటనే పెంచాలన్నారు. అలాగే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులకు పెన్షన్లు రూ.4వేలకు పెంచాలన్నారు. అలాగే ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతీ ఒక్కరికి నూతన పెన్షన్లు మంజూరు చేయాలన్నారు దివ్యాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ అదనపు కలెక్టర్ నర్సింగరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీశ్‌మాదిగ, మహేశ్, వీహెచ్‌పీఎస్ నా యకులు బి.కె. నర్సింహ, సుభాన్‌బాష, హరీఫ్, దివ్యాంగుల సేవాసంఘం సభ్యులు జయంతు డు, కృష్ణ, వెంకటేశ్, మంజుల, రమేశ్ ఎలీషా, దండోరా భాస్కర్, యోసుబు, గోపి ఉన్నారు.

కస్తుర్బా విద్యార్థినులకు వైద్య పరీక్షలు

అయిజ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అయిజ పట్టణంలోని కస్తూర్బా విద్యాలయ విద్యార్థినులకు సోమవారం వైద్యపరిక్షలు నిర్వహించారు. భారత ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా రాష్ట్రీయ బాల్ స్వస్థియ కార్యక్రమంతో ప్రత్యేక వైద్య బృందం వైద్య పరీక్షలు చేశారు. జనరల్‌గా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను డాక్టర్ తరణ్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రత్యేకాధికారి బసవచెన్నమ్మ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయని ప్రభుత్వం

వడ్డేపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయలేదని వడ్డేపల్లి మండల అధ్యక్షుడు బోయ నాగరాజు అన్నారు. సోమవారం వడ్డేపల్లి మండలం బుడమర్సు గ్రామంలో బూత్ అధ్యక్షుడు టీకే శ్రీనివాసులుతో కలిసి గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ 11 సంవత్సరాల్లో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మహిళలకు రూ.2,500లు, నిరుద్యోగులకు భృతి రూ.4వేలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛను పెంచుతామని ఇచ్చిన హామీలను ఇప్పటివరకు అమలుచేయలేదన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో వారిని నిలదీయాలన్నారు.

కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు పరశురాముడు, జక్కిరెడ్డిపల్లి భూత్ అధ్యక్షుడు రాఘవేంద్ర, జిల్లేడుదిన్నె సంజన, కార్యకర్తలు ఉన్నారు.